
# స్టీలు కుర్చీ



బులుసు రామలక్ష్మి

"వీథి వరండాలో ఉన్న స్టీలు ఫోల్డింగ్ చెయిర్ కనిపించడం లేదెందుకోయ్?" అని అడిగాను మా బావమరది త్రిశూలిని–"ఎవరైనా ఇరుగు పొరుగుల వాళ్ళు పట్టుకెళ్ళారా?"

"లేదు బావగారూ! ఎవ్వరూ పట్టుకెళ్ళ లేదే? ఒకవేళ అక్కయ్యకి గాని తెలుసునో ఏమిటో?–కనుక్కుంటానుండండి" అన్నాడు త్రిశూలి.

"నాకూ తెలీదురా కుర్చీ సంగతి. నిన్నటి వరకూ ఉన్న కుర్చీ అప్పుడే ఒక్కరోజులో ఎలా మాయమయిందో!" అంటూ ఆశ్చర్యపడింది. నా అర్ధ దేహం.

"నిన్న మనింటికి ఎవరెవరు వచ్చారు?" అని అడిగాను.

"నిన్న మీకోసం ఎవరూ రాలేదండీ!" అన్నది అర్ధాంగి.

"అఁ అన్నట్టు జ్ఞాపకం వచ్చింది! ఎవరో ఒకాయన — ఓ అరవై అరవై ఐదేళ్ళుంటాయి. పంచె కట్టుకున్నాడు. పైన ఓ ఖద్దరు శాలువా కప్పుకున్నాడు. నేనో పింఛనుదారుణ్ణి. మీ బావగారిచేత ఓ 'లైఫ్ సర్టిఫికేట్' సంతకం పెట్టించుకోవాలి. ఉన్నారా? అంటూ వచ్చాడు." అన్నాడు త్రిశూలి.

నిజమే. నేనో గెజిటెడ్ అధికారిని. నా దగ్గరకు ట్రూ కాపీలని, కేరెక్టర్ సర్టిఫికేట్లని సంతకాలు పెట్టించుకోడానికి అనేకులు వస్తుంటారు. పెన్షన్‌దారులు వరుసగా పన్నెండు నెలలపాటు పెన్షన్ పుచ్చుకోక పోతే, పదమూడో మాసంలో కాని, తరువాత ఎప్పుడైనా కాని పెన్షన్ తీసుకోడానికి వెళ్ళినప్పుడు, వాళ్ళు బ్రతికి వున్నట్లు ఓ లైఫ్ సర్టిఫికేట్ ఏ గెజిటెడ్ ఆఫీసరు చేతనైనా సంతకం చేయించి ప్రొడ్యూస్ చెయ్యాలి. అలా లైఫ్ సర్టిఫికేట్ నా చేత సంతకం పెట్టించుకోవాలని వచ్చిన పెన్షన్‌దారుడు బహుశః మా వీథి వరండాలోని స్టీలు కుర్చీ తస్కరించేడేమో?

"అయితే ఆ పెన్షన్‌దారుడు ఒక్కడే వచ్చాడా? లేకపోతే ముష్టివాళ్ళెవరైనా కూడా వచ్చారా?" అని అడిగాను. ఒకవేళ ఆ భిక్షుకుల్లో ఎవరైనా స్టీలు కుర్చీ లేవనెత్తుకు పోయారేమో అని!

"వేంకటేశ్వరస్వామి కొండ కెళ్తానంటూ ఎవడో వచ్చాడుగాని, వాణ్ణి వీథిలోంచి అలాగే పంపేశాం" అన్నాడు త్రిశూలి.

'' వాడెలా ఉన్నాడు ?''

'' నల్లగా బొద్దుగా మూడు నామాలు పెట్టుకుని ఉన్నాడు ''

'' వాడు నామాలు పెట్టుకుంటే పెట్టుకున్నాడు గాని, మనకి పెట్టలేదు కదా ?''

త్రిశూలి చిరునవ్వు నవ్వుతూ–'' లేదు లెండి ! వాణ్ణి వీధిలోంచి అలాగే పంపేశాను. అక్కయ్య కూడా చూసింది '' అన్నాడు.

భుక్తికోసం ముష్టెత్తే వాళ్ళు, ఇటీవల ముష్టెత్తడంలో కొత్తకొత్త పరిశోధనలు చేసేస్తున్నారు. వెంకటరమణమూర్తి కొండ కెళ్తాననడం పాత బడిపోయిన ముష్టే ! 'కొత్తగ్రహారంలో ఒక దిక్కు లేని ముసిల్ది చచ్చిపోయింది. దహనం చెయ్యాలి. సాయం చెయ్యండి' అని దాసన్న పేటలోనూ, 'దాసన్న పేటలో ముసిల్ది చచ్చిందని కొత్త అగ్రహారంలోనూ ముష్టెత్తుతున్నారు. ఒక వ్యక్తి బస్సుస్టాండులో ముష్టెత్తుకుంటూ, ఎక్కడో బస్సు ప్రమాదంలో కాలు విరిగిందన్నాడు. మళ్ళా అదే మనిషి ఈ మధ్య మా ఆఫీసుకు వచ్చి, పాట్నా వరదల్లో ఇల్లు కూలి కాలు విరిగిందన్నాడు. 'నాయనా ! మేమంతా ఒక రోజు జీతాన్ని వరద బాధితులకి విరాళంగా ఇచ్చేశాము. మనిషి మనిషికీ ఇవ్వాలంటే మా తరం కాదు. ఆ సహాయాన్ని మీ పాట్నా వెళ్ళి ప్రభుత్వం ద్వారాను, సాంఘిక సేవా సంస్థల ద్వారాను అందుకో !' అని పంపించేశారు మా ఆఫీస్ స్టాఫ్.

మహావిష్ణువు పదే పది అవతారాలెత్తి చాలించేసినట్టు విన్నాం గాని, మనిషి మాత్రం కొన్ని వందల అవతారాలెత్తలేనిదే జీవించలేక పోతున్నాడు.

ఇంతలో – '' బాబుగారూ !'' అంటూ వీధి లోంచి ఓ గొంతుక వినిపించింది. వీధిలోకి వెళ్ళి చూశాను. పంచెకట్టు, ఖద్దరు శాలువ పైమీద వేసుకున్న వ్యక్తి కనిపించాడు.

'' తమరికోసం నిన్ననో మాటు వచ్చాను. తమరు లేరు. నేనొక మాజీ రైల్వే ఉద్యోగిని. ప్రస్తుతం విశ్రాంతి తీసుకొంటున్నాను. ఈ మధ్య మా కుటుంబ పరిస్థితులు బావులేక ఒక ఏడాదిగా పెన్షన్ పుచ్చుకుందికి ఈ వూరు రాలేకపోయాను. తమరి చేత లైఫ్‌సర్టిఫికేట్ సంతకం చేయించుకుందామని వచ్చాను '' అని అతి సౌమ్యంగా విన్నవించుకున్నాడు.

నేను ఏ సమాధానమూ చెప్పేలోగా '' బావ గారూ ! మీరోసారి ఇలా రావాలి !'' అని హెచ్చరిస్తున్నట్లు పిలిచాడు మా బావమరది త్రిశూలి. వెళ్ళాను.

'' వీడే బావగారూ ! నిన్న మీ దగ్గర లైఫ్ సర్టిఫికేట్ రాయించుకోవాలని వచ్చాడని చెప్పానే–వాడే వీడు ! మన స్టీలు కుర్చీ కూడా వీడే అపహరించి వుంటాడు '' అన్నాడు త్రిశూలి.

'' నిజంగా వీడే అయితే మళ్ళా మనింటికి లైఫ్ సర్టిఫికేట్‌కోసం వస్తాడా అని ? మళ్ళా మనకు ముఖం చూపించగలడంటావా ?'' సందేహం వెలిబుచ్చాను.

'' ఎందుకు రాకూడదూ ? తనమీద అనుమానం పడకుండా ఉండడానికి వచ్చి వుండొచ్చు కదా !'' అన్నాడు త్రిశూలి.

కానీ నాకు మాత్రం ఎందుకో మనస్కరించలేదు. ఆ వ్యక్తి మీద అనుమానమూ కలగలేదు. కారణం, అతని వేషభాషల్లో ఎంతో సంస్కారం కనిపిస్తూంది. త్రిశూలితో ఏమీ అనలేక తటపటాయిస్తున్నాను.

'' మీరు వూరుకోండి చెప్తాను. వాడి సంగతి నే చూసుకుంటాను !'' అంటూ త్రిశూలి ఆగంతకుణ్ణి సమీపించి – '' ఏఁరా కేడీ ! వరండాలో ఫోల్డింగ్ కుర్చీ మర్యాదగా తెస్తావా లేదా ?'' అన్నాడు ఘాటుగా.

ఆగంతకుడు దీనంగా అన్నాడు :

'' క్షమించండి బాబుగారూ ? నేను దొంగను కాను. నేనొక రిటైర్డు రైల్వే ఉద్యోగిని. నా దైన్యస్థితినిబట్టి తమరలా తొందర పడిపోవడం భావ్యం కాదు !''

'' ఘరానా దొంగలు అలాగే మాట్లాడతార్రా ! ముందు ఆ స్టీలు కుర్చీ తీసుకురా పో ! లేకపోతే నిన్ను శ్రీకృష్ణ జన్మస్థానానికి పంపిస్తాను !'' అంటూ ఆగంతకుని పీక మీద చెయ్యివేసి త్రోసేశాడు త్రిశూలి.

అతను నేల పడ్డాడు. తల మీద బలమైన గాయం తగిలింది. నెత్తురు చిమ్ముతోంది. పైమీద వేసుకున్న ఖద్దరు శాలువ ఊడి పడింది. నా కళ్ళ నుండి నీళ్ళు తిరిగాయి !

పాపం అతనికి చేతులే లేవు !!

త్రిశూలి అష్టాంగాలతో అతని కాళ్ళ మీద పడిపోయాడు !

*

[లలితకుమారి జవాబులు : 9 వ పేజీ నుంచి]

**శ్రీమతి వి. యస్. శేషాద్రి, మద్రాసు**

మా యిల్లు సముద్రపు ఒడ్డున వున్నది. నాకు గులాబిమొక్కలు పెంచడం అంటే చాలా యిష్టం. సముద్రపు ఒడ్డున గులాబీ రావడం కష్టం అంటున్నారు. మీ సలహా ఏమిటి ?

నిజమే. సముద్రపు ఒడ్డున గులాబీలు పెరగడం చాలా కష్టం. మొక్కలు భూమి మీద వెయ్యడం వల్ల అసలు ప్రయోజనం లేదు. తొట్టెల్లో వేసి, ప్రయత్నించాలి. ఎర్ర మన్ను, పశువుపెంట, ఇసుక (ఇసుక అంటే సముద్రపు ఇసుక కాదు–నది ఒడ్డున వుండే ఇసుక) వేసి బాగా సత్తువ ఇచ్చి చూడండి. అయినా సముద్రపు గాలి తగుల్తూనే వుంటుంది కాబట్టి, కష్ట సాధ్యమైన పనే.

**బి. మోహనలక్ష్మి ఎమ్.ఎ., మదనపల్లి**

మా యింట్లో ఏడు సంవత్సరాలుగా ఒక నిమ్మ చెట్టు వుంది. అది విత్తనం నుంచి వచ్చింది. చెట్టు ఆరు అడుగుల పొడవున్నా కాపు మాత్రం లేదు. నీరు పోస్తూనే వున్నాము. మరేం చెయ్యమంటారు?

విత్తనం నుంచి వచ్చే చెట్టు తొందరగా కాపుకి రాదు. అంటయితే త్వరగా వస్తుంది. అయితే మీ చెట్టు పుట్టి ఏడేళ్ళయింది కాబట్టి, అలాగే పెంచుతూ వుండండి. కొన్నాళ్ళకు కాపుకి వస్తుంది.

మా యింట్లో ఎర్ర ముద్ద మందార మొక్క వుంది. చెట్టు ఆరోగ్యంగానే వుంది ; పూలూ పూస్తుంది. కాని, వేసిన మొగ్గలలో సగం మొగ్గలు సరిగ్గా కాడదగ్గర తునిగిపోతున్నాయి. పువ్వులు కూడా తాకితేచాలు, పడిపోతున్నాయి. ఏం చెయ్యమంటారు ?

మందార మొక్కకు ఎక్కువ నీరు వున్నా అలాగే అవుతుంది; నీరు తక్కువైనా అలాగే అవుతుంది. ఈ రెండిట్లో ఏదో ఒకటి జరుగుతోందన్న మాట. అందువల్ల నేల ఎప్పుడూ తడిగా వుండకుండానూ, మొక్క ఎండిపోకుండానూ వుండేలా చూస్తూ నీరు పొయ్యండి.

*